# కామెడీ కథ

భమిడిపాటి సోమయాజి

# హే దీన దయాళో!

ముప్ఫైవపడిలో వున్న దీనదయాళ్, పడి పడి తన బావమరది పెళ్ళికి సతీసమేతంగా హైదరాబాద్ వచ్చాడు.

మధ్యాహ్నం పెళ్ళి విందు జరుగుతోంది. మగవాళ్ళ పంక్తిలో వడ్డనలు జరుగుతున్నాయ్. బొబ్బట్లు, మడతకాజా వగైరా స్వీట్లు వడ్డిస్తున్నారు. దీనదయాళ్ ఆకులో మడతకాజా వడ్డించారు. ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదుకాని, అతని భార్య అనసూయ రయ్ మంటూ వచ్చి, గ్రద్ద పకోడీ పొట్లం తన్నుకుపోయినట్లు, ఆ కాజా అతని విస్తరిలోంచి తీసేసి తన నోట్లోకి తోసేసింది. పైగా ''ఆ కాజా వేస్తూంటే వద్దని చెప్ప లేదా! మీకు పుట్టెడు డయాబిటిస్ కదా!'' అని అరిచింది.

'పుట్టెడు డయాబిటిస్' పద ప్రయోగం చాలా బావుంది! 'పుట్టెడు భూమి' అన్నట్లు వుంది అని ఆమెను మెచ్చుకున్నారు, ఆ పంక్తిలో వున్నవారు.

తర్వాత బొబ్బట్లు వడ్డిస్తున్నారు. ఆ పంక్తిలో వున్న పేరుగల సంఘసేవకుడొకాయన ''బాబూ! నా ఎడమవైపు అయిదో ఆయనకి బొబ్బట్టు వెయ్యకు. ఆయనకి డయాబిటిస్ వుంది'' అని అరిచాడు.

''అదేదో యిల్లు గుర్తుచెప్పినట్లు, ఎడమవైపు అయిదో ఆయన అని చెప్తారేంటండీ!'' అన్నాడు ఆ వడ్డించే ఆయన.

''మరెలా చెప్పమంటావ్!''

''సిల్కు లాల్చీ వేసుకున్నాయన అని చెప్పవచ్చు కదా!''

''పెళ్ళిళ్ళకి ప్రతీవాళ్ళూ వాళ్ళ వాళ్ళ పెళ్ళిళ్ళలో కుట్టించుకున్న శిల్కు లాల్చీలు వేసుకొస్తారు కదూ! అందుకని అలా చెప్పలేదు''

బొబ్బట్టు వెయ్యకుండా ముందుకి పోతూంటే బల్లక్రింద నుంచి ఓ పది రూపాయల నోటు అతనికి చూపించాడు దీనదయాళ్.

అంతే! బొబ్బట్టు విస్తరిలో ధన్‌మని పడింది.

ఇదంతా గమనిస్తూన్న అనసూయ రయ్‌మని మళ్ళీ వచ్చింది. ''ఆ లంచాల బొబ్బట్టు తిన్నారంటే నామీద ఒట్టు'' అంది.

ఆ బొబ్బట్టు వాపస్ చేసి తన పది రూపాయలు తను తీసేసుకున్నాడు దీనదయాళ్.

★ ★ ★

భోజనాలయిన తర్వాత అందరూ పందిట్లో కూర్చుని తాంబూలాలు వేసుకుంటున్నారు.

అనసూయ చుట్టాలు ఒక్కొక్కళ్లే రావడం ''ఏమండీ! మీ డయాబిటిస్ ఎలా వుంది'' అని దీనదయాళ్‌ని అడుగుతూండడం.

అసలు ''మీరెలా వున్నారు'' అని అడగడం పోయి, ''మీ డయాబిటిస్ ఎలా వుంది'' అని కొత్త డాక్టర్ని మీ ప్రాక్టీస్ ఎలా వుందన్నట్లు అడుగుతారేమిటి, ప్రతీవాళ్ళూ అని బాధపడ్డాడు దీనదయాళ్.

ఇంతలో ఒకాయన ''నాకు ఎడమవైపు అయిదో వాడుగా కూర్చున్నాడీయన. పాపం! ఈయన భార్య ఆమె పేరేమిటో తెలియదుకానీ, మహాసాధ్వి. ఆమె ఈయన ఎడల చూపిస్తున్న శ్రద్ధాభక్తులకి, అసలీయన డయాబిటిస్ గురించి ఎవ్వరూ విచారించక్కర్లేదు'' అన్నాడు.

అది విన్న దీనదయాళ్ ''అసలు నా గురించి వీళ్ళెందుకు విచారించడం'' అన్నాడు పక్కన కూర్చున్న తోడల్లుడుతో.

తెలుగు పండితుడు దీనదయాళ్ తోడల్లుడు ''విచారించడం అంటే బాధపడడం కాదు. విషయం గురించి అడగడం, ఇంగ్లీషులో 'ఎంక్వైరీ' అంటారు'' అన్నాడు.

ఇంతలో ఓ పెద్దాయన ''దీనదయాళ్ బాబూ! నీకు బీపీ కూడా వుందా''



అన్నాడు. దీనదయాళ్‌కి పిచ్చికోపం వచ్చింది.

'అసలీ డయాబిటిస్‌తోనూ, నా పెళ్ళాంతోటీ పడలేక ఛస్తుంటే 'బి.పీ కూడా వుందా!' అని అడుగుతున్నాడు. కొంతమందికి ఎంత వయసొచ్చినా బుద్ధిమాత్రం రాదు' అని చికాకుపడుతూ, కొంచెం తమాయించుకుని, ''బీపీ లేదండీ'' అన్నాడు.

''నా లెక్క ప్రకారం వుండాలే! షుగర్, బీపీ కవలపిల్లల్లాంటివి'' అన్నాడు ఆ పెద్దాయన.

'వెధవ లెక్కలూ నువ్వూనూ. ఈ పెళ్ళయిపోయి తిరిగి వెళ్ళేలోపులో, నిన్నేదో ఒకటి చేసి వెళ్ళకపోతే నేను సతీ అనసూయ మొగుడ్నేకాను' అనుకున్నాడు దీనదయాళ్ స్వగతంగా.

''ఇంతకీ మీ ఆవిడ పేరేమిటో చెప్పనేలేదు'' అన్నాడు ఆ పెద్దాయన.

''పేర్లు చెప్పడానికి యిప్పుడు జరుగుతూన్నది నా బావమరది పెళ్ళి. నా పెళ్ళి కాదు'' అన్నాడు వుక్రోషంతో దీనదయాళ్.

''అది తెలుసునయ్యా. నా పెళ్ళి కాదు నా పెళ్ళి కాదు అనుకోకూడదు. జీవితమంతా ప్రతీవాడికీ ఏదో రకంగా పెళ్ళి జరుగుతూనే వుంటుంది. ఇందాకా విందు జరుగుతూండగా నిన్ను స్వీట్స్ తినకుండా చేసి నీకు మందు కూడా వేసి నీ పెళ్ళి చేసిందికదా నీ భార్య. ఆవిడ పేరు ఒక్కసారి ముద్దుగా చెప్పు. ముచ్చటగా వింటాను. ఏదో పెద్దవాడ్ని అడిగాను'' అన్నాడాయన.

'పెళ్ళికి వస్తారు. సుష్టుగా నానా రకాల స్వీట్లు తింటారు. అవి అరిగే వరకూ ఏదో ఒకటి మాట్లాడూంటారు' అనుకుంటూ ''మా ఆవిడ పేరు అసూయ'' అన్నాడు.

''అదేమిటి బాబూ! నా లెక్కప్రకారం 'అనసూయ' అయ్యుండాలే''

''అవునండి. నాకు డయాబెటిస్ కదా! పూర్తిగా చెప్పలేను. నీర్సంగా వుంది. అందుకని ఒక అక్షర లోపం చేశాను'' అన్నాడు దీనదయాళ్.

''అసలు, అవధానాల్లో అక్షర లోపం పెట్టి సమస్యా పూరణాలు యిస్తారు'' అన్నాడు ఓ తెలుగు పండితుడు.

''ఇటువంటి అక్షర లోపాలు చెయ్యడం వలననే 'పూర్ణాలు' తినడానికి వీల్లేకుండా పోతుంది ఈ డయాబిటిస్ వున్నవాళ్ళకి'' అన్నాడు ఆ పెద్దాయన. ఇవన్నీ విని విని, విసిగిపోయిన దీనదయాళ్ రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత ఓ రాత్రివేళ, లైట్ వెయ్యడానికి లేచినట్లు లేచి ఆ చీకట్లో పెద్దాయన కాలిమీద గట్టిగా తొక్కాడు.

''అయ్యో చచ్చాన్రోయ్!'' అంటూ లేచాడు ఆయన.

'ఏం! మధ్యాహ్నం విందులో స్వీట్లు తిన్నట్లు లేదూ! పైగా అసలే దాన్ని చేసుకున్నందుకు ఏడుస్తూంటే నా భార్య పేరు చెప్పిస్తావా! పైగా డయాబిటిస్ వున్నవాళ్ళు పూర్ణాలు తినడానికి లేదా!' అని కసిగా అనుకుంటూ, ''క్షమించండి'' అన్నాడు ఆయనతో.

''ఫర్వాలేదు బాబూ! పెళ్ళిళ్ళల్లో అనేకం జరుగుతాయ్'' అంటూ మరి ఎప్పుడు సేకరించాడో ఏమోగాని తన పక్కనున్న చేతి సంచీలో వున్న ఓ కాజా, రెండు పూర్ణాలూ యిచ్చి ''తినెయ్! అందరూ నిద్రపోతున్నార్లే! మీ ఆవిడకి చెప్పన్లే!'' అన్నాడు మళ్ళీ తొక్కుతాడేమోనన్న భయంతో.

'అలారా దారికి. ఈరోజుల్లో ఓ తొక్కుతొక్కితేనేగానీ మనుషులు తిన్నగా వుండరు' అనుకుంటూ ఆ కాజా పూర్ణాలూ తినేసి, 'పూర్ణం పూర్ణమిదం' అనుకుంటూ పడుకున్నాడు దీనదయాళ్. ఆ మర్నాడు వుదయం పెళ్ళైపోయింది. ఆడపెళ్ళివారు శుక్రవారం పిల్లని అప్పగించమన్నారు. ఆ మర్నాడు శనివారంనాడు అప్పగింతలు నిర్ణయించారు. మరీ మంచిదనుకున్నాడు దీనదయాళ్. ఆ పెద్దాయన ప్రయాణమవడం చూసి, దీనదయాళ్ నీరుకారిపోయాడు. ''మీలాంటి పెద్దలు అంకురార్పణ నుంచి అప్పగింతల వరకూ వుండాలి'' అన్నాడు ఆయనతో. ఎలాగైనా ఈరోజు రాత్రి కూడా ఆయన కాలు మళ్ళీ తొక్కేసి దొంగతనంగా స్వీట్లు తిందామని. మొత్తం మీద ఆయన ధైర్యంచేసి వుండిపోయాడు. కానీ దీనదయాళ్ పడుకున్నచోట కాకుండా ఇంకో చోట పడుకుందామని ప్రయత్నం చేశాడు. తానొకటి తలుస్తే దైవమొకటి తలచినట్లు దీనదయాళ్ దగ్గరే పడుకోవడానికి ఏర్పాటు జరిగింది.

ముందురోజు రాత్రి తిన్న స్వీట్లకి, ఆయన యెడల ప్రేమతో మెలుగుతున్నాడు దీనదయాళ్. అసలెందుకు ఆయనతో అంత వుత్సాహంగా నవ్వుతూ తన భర్త మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు అనసూయకి. కారణం అడిగింది. ''మగాళ్ళతో సరదాగా, నవ్వుతూ మాట్లాడినా నీకు అసూయేనే అనసూయా!'' అన్నాడే కాని అసలు విషయం బయటపడనీయలేదు దీనదయాళ్.

ముందురోజు రాత్రి భరించిన తొక్కుడు విషయం, బయటెక్కడా చెప్పలేదు ఆ పెద్దాయన. రాత్రవుతోందనగా అరిసెలు లడ్డూలు రకానికి మూడేసి, పెద్దాయనకి పురమాయించాడు. హఠాత్తుగా 'తొక్కుడులడ్డూ' జ్ఞాపకం వచ్చింది. రాత్రి అంత కష్టపడి ఆయన కాలు తొక్కి, తొక్కడానికి సంబంధించిన 'తొక్కుడు లడ్డూ' తినకపోవడం, సమంజసం కాదని, ఓ అరకిలో తొక్కుడు లడ్డూ కొని తెమ్మని పురమాయించాడు, ఆ పెద్దాయనకి.


'ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందన్న' సామెత ఎప్పుడో విన్నాడు. ఆ చావు యిప్పుడు అనుభవిస్తున్నాడు పెద్దాయన. పోనీ ఎవర్కైనా చెప్దామంటే దీనదయాళ్ వాళ్ళ యింటి అల్లుడాయె. వాళ్ళు హర్షించరు.

నిద్రకు ముందే ఆ స్వీట్ల నైవేద్యాలు దీనదయాళ్‌కి పెట్టి, అతన్ని నిద్రపుచ్చి ''హే! దీనదయాళ్'' అంటూ దేవుడికి దండం పెట్టుకుని పడుకున్నాడు ఆ పెద్దాయన.

ఆ మర్నాడు అప్పగింతలై అందరూ వెళుతున్నారు. సతీసమేతంగా ఆ పెద్దాయనకి పాదాభివందనం చేశాడు దీనదయాళ్ కృతజ్ఞతతో.

'ఓరి రాక్షసుడా!' అనుకుంటూ ''పెళ్ళైన తర్వాత డయాబిటిస్ లెవెల్ పరీక్ష చేయించుకో బాబూ'' అని ''అనసూయమ్మా! దీర్ఘసుమంగళీభవ'' అని సాగనంపాడు ఆ దంపతుల్ని ఆ పెద్దాయన.

☆



## బిర్యానీ కోసం...

ఇటీవల ఆమీర్ ఖాన్ 'గజినీ' షూటింగ్ గురించి హైదరాబాదులో కొంత కాలం మకాం వేసాడు. ఆ సమయంలో తనకి ఇష్టమైన 'ప్యారడైజ్ బిర్యానీ' తినడానికి స్వయంగా ఆ హోటల్‌కెళ్లి ఎలాంటి హంగామా జరక్కుండానే బయటపడ్డాడట. ఎలాగో తెలుసా? ఎవరూ గుర్తుపట్టకుండా మేకప్‌తో భారీ గడ్డాన్ని తగిలించుకుని వెళ్లాట్ట. ఈ సంగతి అతని సన్నిహితుల ద్వారా మెల్లగా బయటికొచ్చేసిందిలెండి. ష్!